
సారూ.. చైర్మన్ ఎవరూ?

- వినుకొండ పురపాలక అధికారుల తీరుపై విమర్శలు
- జెండా ఆవిష్కరణకు చైర్మన్ స్థానంలో సతీమణి పేరు ప్రకటన
- అభ్యంతరం వ్యక్తం చేసిన కౌన్సిలర్లు
- వెంటనే పేరు సవరించిన కమిషనరు



సవరించక ముందు షకీలా పేరుతో వచ్చిన ఆహ్వానపత్రిక

వినుకొండ: వినుకొండలో మున్సిపల్ అధికారుల తీరు విమర్శలకు దారితీస్తోంది. ఏకంగా మున్సిపల్ చైర్మన్ భార్యనే చైర్మన్ స్థానంలో ఉన్నట్లు అధికారికంగా ప్రకటించడం పట్ల కౌన్సిలర్ల నుంచి తీవ్రవిమర్శలు వెల్లువెత్తాయి. దీంతో వెంటనే అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టి పేరును వెంటనే సవరించారు. వివరాల్లోకి వెళితే... వినుకొండ మున్సిలిటీలో ఆగస్టు 15 జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం, ఆహ్వాన పత్రిక పై చైర్మన్ పేరుతో పాటు చైర్మన్ సతిమణీ పేరు ప్రకటిస్తూ మున్సిపల్ కమిషనరు ఆహ్వాన పత్రిక అందరికీ పంపారు. మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న డాక్టరు దస్తగిరి పట్టణంలో ప్రముఖ కంటి వైద్యనిపుణులు, ఆయన సతీమణి షకీలా కూడా వార్డు కౌన్సిలర్ కావడంతో ఆమె చైర్మన్ స్థానంలో షాడోగా వ్యవహిస్తున్నారు. ఇది పట్టణ ప్రజలందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. పురపాలక సంఘం సమావేశాలు, అత్యవసర సమావేశాలకు తప్ప మిగిలిన అన్నీ అధికారిక కార్యక్రమాలకు ఆమె చైర్మన్ స్థానంలో చలామణీ అవుతూ వస్తున్నారు. అయితే ఇదే అలవాటుగా ఉన్న అధికారులు ఏకంగా షకీలానే జెండా ఆవిష్కరిస్తున్నట్లు ప్రకటించడం విమర్శలకు దారితీసింది. పురపాలక సంఘం కార్యాలయంలో ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమ ఆహ్వాన పత్రికలను మున్సిపల్ సిబ్బంది కౌన్సిలర్లు, వైస్‌చైర్మన్లు, కోఆప్షన్ సభ్యులకు సమాచారం నిమిత్తం పంపిణీ చేశారు.

అందులో జెండా ఆవిష్కరణ చైర్మన్ దస్తగిరికి బదులు శ్రీ /శ్రీమతి షకిలా దస్తగిరి అని అధికారులు ప్రకటించారు. చైర్మన్ దస్తగిరి అయితే తప్పుగా ప్రకటించడం అధికారుల నిర్లక్ష్యమా, అత్యుత్సాహమా... పొరపాటా అని విమర్శలు రావటంతో వెంటనే కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఆహ్వాన పత్రికను సవరించి చైర్మన్ దస్తగిరి పేరును ప్రకటిస్తూ ఓ ప్రకటన జారీ చేశారు.

హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం

శావల్యాపురం: మండలంలోని గుంటుపాలెంలో బీజేపీ సారథ్యంలో హర్ ఘర్ తిరంగా బైకు ర్యాలీ కార్యక్రమం గురువారం నిర్వహించారు.ఈసందర్భంగా మండల బీజేపీ అధ్యక్షులు గట్టుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ప్రదర్శించి దేశభక్తిని చాటుకోవాలన్నారు. అనంతరం బైకు ర్యాలీ గ్రామపురవీధుల్లో నిర్వహించారు కార్యక్రమంలో అన్నవరపు శ్రీనివాసరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

పెట్లూరివారిపాలెంలో తిరంగా ర్యాలీ

నరసరావుపేట రూరల్: ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని పెట్లూరివారిపాలెంలో గురువారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొని జాతీయభావం పెంపొందించేలా భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ర్యాలీ ప్రారంభించిన కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి మాట్లాడుతూ ఎందరో వీరుల త్యాగ ఫలితంగా స్వాతంత్ర్య ఫలాలను భారతీయులందరూ అస్వాదిస్తున్నారని తెలిపారు. జాతీయ భావం పెంపొందేలా ప్రతి ఒక్కరు తమ ఇంటిపై జాతీయజెండాను ఎగురవేయాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. భార్గవ్ భూషణ్‌రావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.అశోక్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని గేదె మృతి

రొంపిచర్ల: మండలంలో సుబ్బయ్యపాలెం గ్రామ సమీపంలో గల హైవే రోడ్డుపై బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని గేదె మృతి చెందింది. ఈ సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. మృతి చెందిన గేదె మండలంలో కొనకంచివారిపాలెం గ్రామానికి చెందిన పానుగోటి వెంకటేశ్వర్లుకు చెందిందని గ్రామస్తులు గుర్తించారు. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.60 వేల రూపాయలు అని బాధితుడు వెంకటేశ్వర్లు తెలిపారు.

శాంతించిన వాగులు, వంకలు

రొంపిచర్ల: మండలంలో వర్షాలు శాంతించాయి. మండల కేంద్రమైన రొంపిచర్లలో గురువారం ఉదయానికి 18.2 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. వాగులు, వంకల్లో కూడా వరదనీరు తగ్గుముఖం పట్టింది. వర్షం లేకపోవటంతో రైతులు పొలంబాట పట్టారు. వరి నారుమళ్లల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపే పనిలో రైతులు ఉన్నారు.

నేడు మద్యం దుకాణాలు బంద్

బొల్లాపల్లి: మద్యం విక్రయించిన, కొనుగోలు చేసిన, బహిరంగ మద్య పానం చేసిన, కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ డి.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం డ్రైడే పాటించాలని, మద్యం దుకాణాలు నిర్వహించడం, విక్రయించడం, కొనుగోలు చేయడం చట్టరీత్యా నేరమని తెలి పారు. లైసెన్స్‌దారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం డ్రై డే పాటించని యెడల చర్యలు ఉంటాయని సీఐ చెప్పారు.

నేడు ప్రత్యేక గ్రామ సభలు

రొంపిచర్ల : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎండివో కె. మ్యాథ్యూబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీల సమగ్రాభివృద్ధి కోసం, స్థానిక సంస్థల పాలనలో ప్రజల భాగస్వామ్యం కోసం ఈ సభలు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు తప్పని సరిగా ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

ఉద్యాన పంటల్లో యాజమాన్య పద్ధతులు మేలు

నరసరావుపేట రూరల్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉద్యాన పంటలకు నష్టం కలగకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి ఐ.వెంకట్రావు తెలిపారు. పొలాల్లో నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపాలని, పంట ఎదుగుదలకు తోడ్పడే విధంగా బూస్టర్ ఎరువులను వేయాలని సూచించారు. అధిక తేమ వలన తెగుళ్లు, పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. లేత తోటల్లో చనిపోయిన మొక్కలను తీసివేసి కొత్త మొక్కలను నాటుకోవాలని, చెట్ల మధ్య దున్నడం వలన తేమ త్వరగా ఆరీ చెట్లు కొలుకుంటాయని తెలిపారు. మిరపలో వర్షపు నీటిని బయటకు పంపిన అనంతరం ఎకరాకు 50 నుంచి 60 కేజీల యూరియా, 25 నుంచి 30 కేజీల పొటాష్ వేసుకోవాలని తెలిపారు. ఇదే పదునులో ఎకరాకు 200 కిలోల వేప పండిని వేసుకోవాలని, తేమ ఎక్కువగా ఉంటే పొటాషియం నైట్రేట్ ఒక శాతం ద్రావణాన్ని 10 రోజుల వ్యవధిలో పైరుపై పిచికారీ చేయాలని తెలిపారు. కూరగాయల పంటలపై వర్షాల ప్రభావంతో మొలక శాతం తగ్గడం, విత్తనం కుళ్లిపోవడం, వేరు కుళ్లిపోవడం, పోషకాల లభ్యత తగ్గిపోయి చీడపీడల బెడద ఉంటుందని వివరించారు. పసుపు పంట నాలుగు రోజుల కంటే ఎక్కువ నీటిలో ఉంటే వయసుతో సంబంధం లేకుండా వేరే పంటను వేసుకోవాలని తెలిపారు. పండ్ల తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు.

24 మార్కెట్ యార్డు నూతన కమిటీ ప్రమాణస్వీకారం

నాదెండ్ల: చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు యార్డు కార్యదర్శి డి తిరుపతి రావు చెప్పారు. ఈ నెల 12న ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా షేక్ కరిముల్లా, ఉపాధ్యక్షుడిగా పిల్లి కోటి ప్రమాణస్వీకారం చేయనున్నారు. గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, డైరెక్టర్లుగా జాష్టి రవి, పోపూరి హనుమంతరావు, ఆముదాల లీలా కిషోర్, చెన్నంశెట్టి పద్మ, నెల్లూరి శాంతిప్రియ, గూడే అంజలి, పల్లపు సుమలత, అనంత వీరకుమారి, కూరపాటి మల్లేశ్వరి, మందా దుర్గాభవాని, మొగిలి వెంకటనారాయణ, కాట్రు శ్రీనివాసరావు, షేక్ అబ్దుల్‌నబి, ఎక్స్‌అఫీషియో సభ్యులుగా మూలె పిచ్చిరెడ్డి, చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ రఫానీ, నరసరావుపేట అసిస్టెంట్ అగ్రికల్చర్ ఆఫీసర్, జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్‌శాఖ అధికారి వ్యవహరించనున్నారు. ఈ నెల 24న సాయంత్రం 5 గంటలకు పాత మార్కెట్ యార్డులో ప్రమాణ స్వీకారం జరగనుంది.

భయపెడుతున్న విద్యుత్ స్తంభం



నాదెండ్ల: గణపవరం నుంచి చిలకలూరిపేట వెళ్లే డొంక రోడ్డులోని లక్ష్మీ గణపతి ఆలయం వద్ద హైటెన్షన్ విద్యుత్ లైను ప్రమాదభరితంగా మారింది. ఇటీవల ఈ ప్రాంతంలో అయ్యప్పస్వామి ఆలయం నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు హైటెన్షన్ విద్యుత్ లైన్లస్తంభాలను మార్పు చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు విద్యుత్ స్తంభం మొదట్లో కుంగింది. స్తంభం చుట్టూ మట్టి కుంగటంలో స్తంభం ఒరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభాన్ని పునరుద్ధరించి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు

సత్తెనపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన పత్తి పంట పొలాల్లో నీటిని బయటకు పంపి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు అన్నారు. మండలంలోని నందిగామ గ్రామంలో వర్షాలకు నీట మునిగిన పత్తి పంట పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పొలంలో నిల్వ ఉన్న వర్షపు నీటిని బయటకు పంపించి, యూరియా 20 కేజీలు, పొటాష్ 10 కేజీలు ఎకరానికి చేనుపై వెదజల్లుకోవాలన్నారు. సత్తనపల్లి ఏడీఏ బోయపాటి రవిబాబు, ఏవో బి.సుబ్బారెడ్డి, రైతులు ఉన్నారు.

ఎరువులపై సమీక్ష...

సత్తెనపల్లి సబ్ డివిజన్‌లోని పీఏసీఎస్‌లు, జీడీసీఎమ్ఎస్, ఏబీఎఫ్ఎస్‌సీఎస్ ధూళ్ళిపాళ్ల బ్రాంచ్, తదితర ప్రభుత్వ రంగ సంస్థల సీఈఓ, ప్రెసిడెంట్లతో ఎరువుల అమ్మకాలపై జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు గురువారం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల అమ్మకాలు ఈ-పాస్ ద్వారానే చేయాలన్నారు. భౌతిక నిల్వలకు ఈ-పాస్ మెషిన్‌లో పరిమాణాలకు వ్యత్యాసం ఉన్నట్లయితే వారికి ఎరువులు కేటాయింపు నిలిపివేయబడుతుందన్నారు. అదే విధంగా వారిపై శాఖాపరమైన చర్యలు కూడా తీసుకోబడతాయన్నారు. ఎరువులు అమ్మకాలు జరిపి తరువాత తప్పనిసరిగా ఈ-పాస్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో సత్తెనపల్లి ఏడీఏ బోయపాటి రవిబాబు, సత్తెనపల్లి, ముప్పాళ్ళ ఏవోలు బి.సుబ్బారెడ్డి, ఎస్.శ్రీధర్ రెడ్డి, ఆయా పీఏసీఎస్‌లు, జీడీసీఎమ్ఎస్, ఏబీఎఫ్ఎస్‌సీఎస్ ధూళ్ళిపాళ్ల బ్రాంచ్ సీఈఓలు, ప్రెసిడెంట్లు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నాదెండ్ల: వాయుగుండం ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు విద్యుత్ లైన్లు, స్తంభాల వద్ద అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ ఏడీఈ అశోక్‌కుమార్ చెప్పారు. తడిచిన విద్యుత్ స్తంభాలు, సపోర్టు తీగలను ముట్టుకోరాదని, తడి చేతులతో స్విచ్‌లు వేయటం చేయకూడదన్నారు. విద్యుత్ స్తంభాలకు చెట్లు తగులుతున్నా, కరెంటు వైర్లు క్రిందకు వేలాడుతున్నా అధికారులకు సమాచారమివ్వాలని కోరారు. ఉరుములు, మెరుపుల సమయంలో ఇంట్లోని టీవీ, ఫ్రిజ్, ఏసీ, కంప్యూటర్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు ఆపివేయాలన్నారు. విద్యుత్ షాక్‌కు గురవకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

మెడికల్ కళాశాలకు డాక్టర్ బాబురెడ్డి మృతదేహం




మెడికల్ కళాశాలకు మృతదేహాన్ని అప్పగిస్తున్న కుటుంబసభ్యులు

నరసరావుపేట రూరల్: అనారోగ్యంతో మృతిచెందిన పట్టణ ప్రముఖ వైద్యుడు డాక్టర్ నంద్యాల కుసుమ హరనాథ బాబురెడ్డి (87) మృతదేహాన్ని గురువారం గుంటూరు మెడికల్ కళాశాలకు అప్పగించారు. పల్నాడు రోడ్డులోని ఆయన నివాసంలో మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, పట్టణ వైద్యులు, బంధువులు నివాళులు అర్పించారు. అనంతరం అంబులెన్స్ వాహనంలో మృతదేహాన్ని గుంటూరు మెడికల్ కళాశాలకు తరలించారు. మానవ శరీర నిర్మాణాన్ని అధ్యయనం చేసే అనాటమీ విభాగానికి మృతదేహాన్ని అప్పగించారు. తన మరణానంతరం మృతదేహం యువ వైద్యుల అధ్యయానికి ఉపయోగపడేలా మెడికల్ కళాశాలకు అందజేయాలని డాక్టర్ బాబురెడ్డి చివరి కోరిక మేరకు గుంటూరు మెడికల్ కళాశాలకు అప్పగించినట్టు బంధువులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బాబురెడ్డి కుమారుడు డాక్టర్ నర్సింహారెడ్డి, డాక్టర్ శిరీష యజ్ఞం తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లపై ప్రజలు ఉద్యమించాలి


కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అలెగ్జాండర్



మాట్లాడుతున్న అలెగ్జాండర్

వినుకొండ: బీజేపీ ప్రభుత్వంలో జరిగిన దొంగ ఓట్ల బాగోతంపై ప్రజలు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గర్నెపూడి అలెగ్జాండర్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వినుకొండ నియోజకవర్గ ఇన్చార్జి బోయపాటి రామాంజనేయులు అధ్యక్షత జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ అండదండతో దేశ ఎన్నికల సంఘం అనేకచోట్ల దొంగ ఓట్లను చేరుస్తోందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం చేసిన మోసాలను సంఖ్యలతో సహా తమ నాయకుడు రాహుల్ గాంధీ బయటపెట్టారని, ఇప్పటికైనా ఎన్నికల సంఘం మొద్దు నిద్ర లేచి చేసిన తప్పు ఒప్పుకొని జరిగిన తప్పును సరిజేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్నాడు జిల్లా కాంగ్రెస్ అధికారి ప్రతినిధి రెడ్డి బోయిన ప్రసన్న కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, యువజన కాంగ్రెస్ నేత పఠాన్ కరీముల్లాఖాన్, పల్నాడు జిల్లా అసంఘటిత కార్మిక విభాగం అధ్యక్షులు పిడుగు విజయ్, వినుకొండ రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు అడపాల శ్రీనివాసరావు, వినుకొండ ఎస్సీ సెల్ అధ్యక్షులు కందుల దేవ, ఎస్సీ సెల్ నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.

అమ్మో.. కొండచిలువ!



చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: సాధారణంగా అడవుల్లో, పొలాల గట్లపై కనిపించే కొండచిలువ ఒకటి ఏకంగా ఇళ్ల మధ్యలోకి రావడంతో చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామంలోని వడియ రాజుల కాలనీ వాసులు భయంతో వణికిపోయారు. గురువారం ఉదయం ఈ భారీ సర్పం కనిపించడంతో కాలనీలో ఒక్కసారిగా కలకలం రేగింది. గ్రామానికి అనుకుని ఉన్న కొండ ప్రాంతం నుంచి వచ్చిన ఈ కొండచిలువ, కాలనీలోని ఒక ఇంటి వెనుక ఉన్న పొదల్లో నక్కి ఉంది. దానిని చూసిన స్థానికులు ఒక్కసారిగా భయంతో కేకలు వేశారు. కొండచిలువ వచ్చినట్లు సమాచారం అందుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. సుమారు 10 అడుగుల పొడవుతో భారీగా ఉన్న ఆ కొండచిలువను చూసి గ్రామస్తులు భీతిల్లారు. అది ఎవరిపైన దాడి చేస్తుందోనని ఆందోళన చెందారు. కొందరు సాహసించి కర్రలతో దానిని దూరంగా తరిమే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం ఆ కొండచిలువ కొండ వైపుగా వెళ్లిపోయిందని స్థానికులు తెలిపారు. అయితే మరోసారి అది తిరిగి వస్తుందేమోనని కాలనీవాసులు భయపడుతున్నారు. అటవీ శాఖ అధికారులు దీనిపై దృష్టి సారించి, అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.